క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయపురిసౌత్ : మాచర్ల మండలంలోని కొప్పునూరు, అనుపు ఫీడర్లలోని 33 కేవీ పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ మాచర్ల డీఈ ఏ రామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్స్ పరిధిలోని లైన్ మెయింటెనెన్స్, రోడ్డు వైడెనింగ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

చెట్ల పెంపకంతో అదనపు ఆదాయం



మాచవరం: అటవీయేతర ప్రాంతాల్లో చెట్ల పెంపకంతో ఆదాయ వనరులు చేకూరతాయని ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా (టీవోఎఫ్ఐ) ప్రోగ్రాం స్టేట్ అసోసియేట్ మారపల్లి ప్రణీత్ వర్మ అన్నారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో అటవీయేతర ప్రాంతాల్లో ఆగ్రో ఫారెస్ట్ ద్వారా చెట్ల పెంపకంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలాల్లో చెట్లు పెంచడం వలన కలిగే లాభాలను తెలియజేశారు. ఉద్యాన, అటవీ మొక్కల పెంపకంతో పంటలతో పాటు అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు. చెట్ల పెంపకం పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో కె.రామమ్మ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ షేక్ ఖాశీం, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యారాశి వెంకట్రావు, వీఏఏ నర్సయ్య, ప్రసాద్, అప్పారావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం



మాచర్ల: పేదల కోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను మాచర్ల పట్టణంలో నేడు ప్రారంభించటం సంతోషకరమని, మూడు పూటల తక్కువ ధరకు పేదల ఆకలి తీర్చేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్ అండ్ బీ కార్యాలయం ముందున్న అన్న క్యాంటీన్‌ను టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు మదార్‌సాహెబ్, మారం ప్రసాద్, కజ్జం సైదయ్య, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్, ఏఈ గౌతమి పాల్గొన్నారు.

విద్యార్థినులకు సహకారం

గురజాల : పదవ తరగతిలో ఉత్తమ ఫలితం సాధించిన విద్యార్థినులకు ఉపాధ్యాయులు సహకారం అందించారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని గురజాలలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని తేజస్విని, మౌనికలను సత్కరించి ఆర్థిక సహకారం అందించారు. మంచి చదువులు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.కాంతారావు, విద్యా కమిటీ చైర్మన్ కె.కోటేశ్వరరావు, తదితరులున్నారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలోని కేజీబీవీలో విద్యార్థినికి కూడా సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జ్యోతి, మండల కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్ తదితరులున్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం



హసనాబాద్(క్రోసూరు): మండలంలోని హసనాబాద్ గ్రామంలో బోరు పంపు నీళ్లు తాగి కొంతమంది అతిసారకు గురైన సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం గత మూడు రోజులగా కొనసాగుతుంది. శుక్రవారం మరో ఇద్దరు అతిసారతో బాధపడుతున్నట్లు గుర్తించి ఒకరిని సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించగా మరొకరికి ఇంటి వద్ద చికిత్స అందిస్తున్నట్లు వైద్యుడు డాక్టర్ సాద్ తెలిపారు. మరో రెండు రోజుల పాటు రాత్రి పగలు వైద్య శిబిరం కొనసాగుతుందని, గ్రామస్తులు ఎవరైనా అతిసార లక్షణాలు కనబడితే వైద్య శిబిరానికి రావాలని డాక్టర్ కోరారు. ఇంటింటికీ వెళ్లి అతిసార బాధితులు ఎవరైనా ఉన్నారామో తెలుసుకునేందుకు ఏఎస్ఎంలు, ఆశ వర్కర్లు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దొడ్లేరు పీహెచ్‌సీ ఏఎస్ఎంలు, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



సేవా పురస్కారం అందుకుంటున్న వ్యవసాయాధికారిణి సంధ్యారాణి



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఏవో



సేవా పురస్కారాన్ని అందుకుంటున్న ప్రసాద్



అవార్డు అందుకుంటున్న ఎంపీడీవో సరోజినీదేవి



అవార్డు అందుకుంటున్న వెంకటలక్ష్మి

గురజాల : విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పలువురు ఉద్యోగులు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని పురస్కారాలను గురువారం పల్నాడు జిల్లా నరసరావుపేటలో అందుకున్నారు. వ్యవసాయ శాఖ నుంచి మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి, సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూవో సుజాత కుమారిలు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుల చేతులమీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.

అమీర్‌రెడ్డికి అభినందనల వెల్లువ

దుర్గి: 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండల వ్యవసాయాధికారి వై.అమీర్‌రెడ్డి ఉత్తమ వ్యవసాయాధికారిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నరసరావుపేటలో నిర్వహించిన వేడుకలలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో పంట బీమా పథకం కింద మండలంలో రూ.9 కోట్ల పై చిలుకు ఉచిత బీమా నగదు రైతుల ఖాతాలకు జమ అయ్యాయి. జిల్లాలో మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపటం విశేషం. పలువురు రైతు నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, సహచర ఉద్యోగులు అమీర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ ప్రశంసలు రావటానికి కారకులైన మండల రైతాంగానికి, సహకరించిన ప్రజా ప్రతినిధులు, నాయకులకు ఏవో అమీర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ముటుకూరు వాసికి ఉత్తమ సేవా పురస్కారం

దుర్గి: మండలంలోని ముటుకూరు గ్రామానికి చెందిన దళిత బహుజన సేవా సంఘం వ్యవస్థాపకులు కుక్కమూడి ప్రసాద్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి ప్రశంసాపత్రం రావటం ఆనందంగా ఉందని మరింత సేవ చేసేందుకు బాధ్యతగా భావిస్తున్నానన్నారు. మండలంలోని పలు సంఘాల నాయకులు, స్నేహితులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉత్తమ ప్రతిభ పురస్కారం అందుకున్న ఎంపీడీవో

మాచర్ల రూరల్: మండల అభివృద్ధిలో ముఖ్యంగా ఆర్థిక సంఘం నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించి పారిశుద్ధ్య నిర్మూలనకు విశేషంగా కృషి చేసినందుకు మండల అభివృద్ధి అధికారిణి కె.సరోజనీదేవికి, అలాగే మండల పరిధిలోని తాళ్ళపల్లి గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ జి.వెంకటలక్ష్మి ప్రజలకు నిర్ణీత సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూసినందుకు, ముఖ్యంగా పింఛన్ పంపిణీ, ఆరోగ్య శ్రీ కార్డులు, క్యాస్ట్, ఇన్‌కమ్ తదితర సర్టిఫికెట్లను సకాలంలో పంపిణీ చేసినందుకు గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలను వారికి మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీపీ బూడిద మంగమ్మ, జెడ్పీటీసీ మండ్లి మల్లుస్వామి, ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఎంపీడీవోను అభినందించారు. అలాగే వెంకటలక్ష్మిని కార్యాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అభినందించారు.

ఉత్తమ అధికారులకు అభినందనల వెల్లువ

మాచర్ల: నియోజకవర్గంలోని మాచర్ల పట్టణానికి సంబంధించి ఉత్తమ అధికారులు, ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు పలువురు అభినందనలు తెలిపారు. అందులో భాగంగా ఉద్యానవన శాఖాధికారిగా పనిచేస్తున్న సురేష్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ అరుణ్‌బాబు ప్రశంసించారు. పురపాలక సంఘానికి చెందిన ఆర్‌వో పఠాన్ అఫ్జల్‌ఖాన్, జూనియర్ అసిస్టెంట్ జహీర్‌బాషాతో పాటు పలువురిని అభినందించారు. పట్టణంలోని ఓక్ బ్రిడ్జ్ స్కూల్‌లో కొమ్మారెడ్డి చలమారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ అభినందించి అవార్డులు అందించారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ హనుమంతరావు, డైరెక్టర్లు డా.శివ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రంతో పాటు నగదు అందించారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బిగ్ హెల్ప్ సంస్థ నిర్వాహకులు షేక్ చాంద్‌బాషా, భాస్కర్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు.

■ పట్టణంలోని పాత మాచర్లలో వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆవోపా అధ్యక్షులు జీవీకేఎస్ ప్రసాద్, రాచమడుగు ప్రసాద్‌ల ఆధ్వర్యంలో సుమారు 50 మంది విద్యార్థులకు రూ.3 వేల చొప్పున నగదు బహుమతి, మెమెంటోలను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో సరోజనీదేవి, నాయకులు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, కంభంపాటి అనిల్‌కుమార్, పరిటాల ధనలక్ష్మిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ చెన్నా, కోశాధికారి తిరివీధి వెంకట నాగేశ్వరరావు, పోలిశెట్టి పిచ్చయ్య, సత్యనారాయణ తదితరులున్నారు.



ఓక్ బ్రిడ్జ్ స్కూల్‌లో విద్యార్థులతో సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్



అవార్డు అందుకుంటున్న ఉద్యాన శాఖాధికారి సురేష్



అవార్డు అందుకుంటున్న పఠాన్ అఫ్జల్‌ఖాన్



అవార్డు అందుకుంటున్న జహీర్‌బాషా

వర్షాకాలం వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ రెడ్డి



రోగులకు మందులను పంపిణీ చేస్తున్న గోలి వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ రెడ్డి

మల్లవరం(రెంటచింతల): వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గోలి పీహెచ్‌సీ వైద్యాధికారి వి.ప్రదీప్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని మల్లవరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలంలో జ్వరం వచ్చిన వెంటనే పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లముందున్న సైడ్ కాలువలలో మురుగుపై కిరోసిన్ లేదా బ్లీచింగ్ చల్లుకోవాలని దీంతో ఈగలు, దోమలు నశిస్తాయని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడుకోవాలని, ఇళ్లలో పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలను తొలగించాలని, కూలర్‌లలోని నీటిని వారానికి ఒకసారి మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం అంజలి, సీహెచ్‌వో శిరీష, ఆరోగ్య కార్యకర్త ఖాసిం, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జన్మపాపం లేని పునీతురాలు మరియతల్లి

ఫాదర్ వైఎల్ మర్రెడ్డి



పురవీధులలో మరియమాత విగ్రహ ఊరేగింపు

రెంటచింతల: జన్మపాపము లేని పునీతురాలైన కన్య మరియతల్లి భూ మండలానికి రాణిగా.. దేవమాతగా.. కొనియాడబడుతుందని యహోవా దేవుడు ఆజ్ఞాపించాడని కానుకమాత చర్చి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ వైఎల్ మర్రెడ్డి అన్నారు. శుక్రవారం మరియతల్లి మోక్షారోహణం పండుగ మహోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీస్తు ప్రభువును అనుసరించిన తొలి క్రైస్తవురాలు పవిత్ర తల్లి, తొలి శ్రీ సభను ముందుండి నడిపించిన నాయకురాలు మరియతల్లి అని తెలిపారు. ఏసుక్రీస్తుకు విధేయురాలు, విశ్వాసి, ప్రియ మార్గదర్శిగా ప్రపంచ కథోలికులచే కొనియాడబడుతున్న కన్య మరియతల్లి ఆదర్శమూర్తిగా నిలిచారన్నారు. ముందుగా మరియతల్లి విగ్రహంతో భక్తి గీతాలను ఆలపిస్తూ.. జపమాలను చెప్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విచారణ సహాయ గురువులు ఫాదర్ అగస్టీన్, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రేపటి దేశ భవిష్యత్ నేటి విద్యార్థులదే

మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్‌రెడ్డి



నగదు, షీల్డ్స్ అందుకున్న విద్యార్థులతో దాతలు, ఉపాధ్యాయులు

దాచేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు భావిభారత పౌరులుగా ఎదగాలని, రేపటి దేశ భవిష్యత్ నేటి విద్యార్థులదేనని మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుకున్న విద్యార్థుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 16 మంది విద్యార్థులకు రూ.61 వేల ప్రోత్సాహక నగదు, షీల్డ్స్ వినాయక ఇండ్రస్ట్రీస్ నిర్వాహకులు గొట్టం ఆంజనేయరెడ్డి శుక్రవారం అందజేశారు. హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం నిర్వహణకు ఆంజనేయరెడ్డి రూ.10 వేలు, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి రూ.10 వేలు సాయం అందించారు.

మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వినాయక ఇండ్రస్ట్రీస్ ద్వారా హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు సహకారం అందించామని, విద్యార్థులకు సాధ్యమైనంత వరకు సహకారం అందిస్తామన్నారు. దాత ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ ప్రోత్సాహక నగదు అందించటం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం ఏర్పడుతుందని, విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి స్థానాల్లో ఉంటారన్నారు. తాను ఈ హైస్కూల్‌లో చదువుకోవటం వలన క్రమశిక్షణతో ఎదిగి సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉన్నానని, విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకుని మంచి భవిష్యత్‌కి పునాదులు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ షేక్ హఫీజ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మండల కన్వీనర్ కోట కృష్ణ, నాళం శ్రీనివాసరావు, కొప్పుల గురవారెడ్డి, కొమ్మా కరుణకర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



గుండ్లపాడులో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ నఫీజ్ బాషా, ఎస్ఐ సత్యనారాయణ

వెల్దుర్తి: గ్రామాల్లో చిన్న చిన్న ఘర్షణలు పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన గుండ్లపాడు, గొట్టిపాళ్ళలో పర్యటించి మాట్లాడారు. అనవసరమైన గొడవలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అన్నదమ్ముల లాగా కలిసి ఉండాల్సిన గ్రామస్తులు పార్టీల పేరుతో కొట్టుకొని పోలీసు స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగవద్దన్నారు. ఘర్షణలకు పాల్పడితే కుటుంబాలు వీధిన పడతాయన్నారు. ముఠా తగాదాల వలన కుటుంబాలు నష్టపోతాయన్నారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలీసులు సత్వరమే పరిష్కరిస్తారన్నారు. ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హాల్ట్ కల్పించాలి.. ప్రజల ఆకాంక్ష తీర్చాలి

పెదకూరపాడు: పెదకూరపాడులో పల్నాడు ఎక్స్‌ప్రెస్, రేపల్లె–సికింద్రాబాద్ పాసింజర్ రైలుకు హాల్ట్ కల్పించాలని పెదకూరపాడు ప్రాంత రైతులు, ప్రయాణికులు చేపట్టిన సంతకాల సేకరణ ఉద్యమం శుక్రవారం పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కన్నెగండ్ల, బుచ్చియ్యపాలెం గ్రామాల్లో రైతులు, ప్రయాణికులు, మహిళల వద్ద నుంచి పెద్ద ఎత్తున సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు మాట్లాడుతూ హాల్ట్ కల్పించే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ అక్బర్, కోరంపల్లి గురు ప్రసాద్, కాసరబాధ కోటేశ్వరరావు, కోరంపల్లి నరసింహారావు, క్రాపా సుబ్బారావులు పాల్గొన్నారు.

శాంతి పరిరక్షణకు కృషి చేస్తా

ఎస్ఐ సుధీర్‌బాబు



మాట్లాడుతున్న ఎస్ఐ సుధీర్‌బాబు

దుర్గి: మండల పరిధిలోని గ్రామాలలో శాంతి పరిరక్షణకు కృషి చేస్తానని, నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఎల్.సుధీర్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. జూదం, అక్రమ మద్యం వంటి వాటిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు సహకరించాలన్నారు. రోడ్డు మీద వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే సహించమన్నారు. ఎవరైనా ఇతరులకు ఇబ్బందులు కలిగించే పనులు చేస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సహకరించాలన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుధీర్‌బాబుకు పలువురు అభినందనలు తెలిపారు.


మహనీయుల సేవలు మరువలేనివి



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఆదిరాల ఆదాం

వెల్దుర్తి: దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావటంలో మహనీయులు ఎంతగానో కృషి చేసినట్లు డప్పు, జానపద కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆదిరాల ఆదాం అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 25 మంది ఎస్సీ పేద వృద్ధ మహిళలకు చీరలు మాజీ సర్పంచ్ కేసిరెడ్డి వెంకటరెడ్డి, డప్పు కళాకారుల ప్రెసిడెంట్ కుక్కమూడి నాగయ్య, ఆదిరాల ఇస్సాకు చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఆదాం మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నామని, పలువురు పేదలకు నివేశన గృహాలు, వ్యవసాయ భూములు వచ్చేలా కృషి చేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుక్కమూడి విజయకుమారి, రాయంకుల సాలమ్మ, అల్లి మరియమ్మ, కుక్కమూడి మరియమ్మ, ఆరుముల్ల కుమారి, ఆరుముళ్ళ జాంబమ్మ, మీసాల శాంతమ్మ, కుక్కమూడి చిన అక్కులు, మీసాల మరియమ్మ తదితరులున్నారు.

ప్రైవేటు హాస్పిటల్స్‌లో వైద్య సేవలు బంద్



మాట్లాడుతున్న వైద్యులు

పిడుగురాళ్ల: పట్టణంలోని అన్ని ప్రైవేటు హాస్పిటల్స్‌లో 24 గంటల పాటు వైద్య సేవలు నిలుపుదల చేస్తున్నట్లు ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) సభ్యులు విలేకరుల సమావేశంలో తెలిపారు. పశ్చిమ బెంగ్‌లో డాక్టర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆ రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకుని వారి కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా 17న ఉదయం 6 గంటల నుంచి 18వ తేదీ ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వైద్య సేవలు చేయటం జరగదని తెలిపారు. అత్యవసరమైన కేసులు మాత్రమే చూడటం జరుగుతుందని అన్నారు. పిడుగురాళ్ళ, మాచవరం, దాచేపల్లి, కారంపూడి ప్రాంతాలలోని ప్రైవేటు హాస్పిటల్స్‌లో వైద్య సేవలు నిలుపుదల చేస్తున్నామని, ఐఎంఏ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకోవటం జరిగిందని దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని వారు తెలిపారు.

నేడు పురపాలక సంఘ అత్యవసర సమావేశం

మాచర్ల : పురపాలక సంఘ అత్యవసర సమావేశాన్ని శనివారం ఉదయం 10 గంటలకు పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకటదాస్ శుక్రవారం తెలిపారు. పురపాలక సంఘ పరిపాలన విభాగంతోపాటు, పలు అంశాలపై చర్చించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు అధ్యక్షత వహిస్తారని, ఎక్స్ అఫిషియో సభ్యునిగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొంటారన్నారు. సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో ఏకగ్రీవంగా ఎన్నికైన 14 మంది కౌన్సిలర్లు ప్రస్తుతం టీడీపీలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో చేరారు. మున్సిపల్ చైర్మన్ మాచర్ల ఏసోబు, వైస్ చైర్మన్ పి.నరసింహారావులు సైతం గురువారం రాత్రి ఎమ్మెల్యేను కలిసి తమ మద్దతు టీడీపీకి ఉంటుందని తెలిపారు.

పలు ఆలయాల్లో శ్రావణమాస ప్రత్యేక పూజలు

- ప్రత్యేక అలంకరణల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- సామూహిక వరలక్ష్మీవ్రతాల నిర్వహణ









పిడుగురాళ్లలో ధనలక్ష్మీ అలంకరణలో కనకదుర్గమ్మ ప్రత్యేక అలంకరణలో వాసవి అమ్మవారు రెంటచింతల తహసీల్దార్ కార్యాలయం వద్ద, బాలవికాస్ స్కూల్ వద్ద చౌడేశ్వరి అమ్మవారు

పిడుగురాళ్ల: శ్రావణమాసం రెండవ శుక్రవారం కావటంతో పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దీనిలో భాగంగా భవాని నగర్‌లోని కనకదుర్గ అమ్మవారిని ధనలక్ష్మీగా అలంకరించారు. అదే విధంగా జానపాడు రోడ్డులోని వాసవీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

రెంటచింతల: రెండవ శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు పూజలు, నోములు, వ్రతాలు చేయడంతో మండలంలోని వివిధ గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలు అమ్మవారి దేవాలయాలలో భక్తులు శుభాలనొసగే వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అర్చకులు ఓరుగంటి మారుతి శర్మ ఆధ్వర్యంలో, బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో అర్చకులు అనీల్‌కుమార్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా మహిళలు వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు. శ్రావణ శుక్రవారం పూజలు చేయడం వలన సకల సంపదలు, సుఖ సంతోషాలు కలుగుతాయని అర్చకులు తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. దేవస్థానం కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని పాలువాయి జంక్షన్ వద్ద వేంచేసిన కనకదుర్గ అమ్మవారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేదలకు అన్నం పెట్టేదే అన్న క్యాంటీన్

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల: పేదలకు అన్నం పెట్టేదే అన్న క్యాంటీన్ అని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని కట్టెల అడితీల సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పెట్టిన అన్న క్యాంటీన్‌లు మరలా పునఃప్రారంభిస్తున్నామని తెలిపారు. అన్న క్యాంటీన్‌కు దాతల సహకారం కావాలని మొదటి రోజు రూ.1.27 లక్షలు విరాళంగా అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కమిషనర్ గిరికుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.